12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026
ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 32 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల మంగళవారం 6 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 32 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA TUE 6 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




# ఇంటింటికీ జలధార..

## రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు.
ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

- మిగతా 2లో



# అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ
- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు.

- మిగతా 2లో



# 2029 నాటికి 4-స్టార్..

## ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!

- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని

- మిగతా 2లో



# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

- మిగతా 2లో

# వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

- టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ

- మిగతా 2లో



# నిజం బయటపడ్డది..




## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై రాహుల్ ఫైర్

పెన్ పవర్ డెస్క్: సర్ ప్రక్రియలో అవకతవకలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష తీరుపై ఆరోపణలకు సంబంధించి కేంద్ర

- మిగతా 2లో



# 'మా అనుమతి లేదు'..

## ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

పెన్ పవర్ డెస్క్:కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు.ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని

- మిగతా 2లో

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి



# రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:పెరుగుతున్న అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యాచారం చేసే వారికి శిక్షలు మరింత కఠినంగా ఉండాలని .. రేప్ చేయాలం టేనే భయపడి పోవాలని ఢిల్లీ పోలీసులు కీలక ఆదేశాల జారీ చేసింది. ఢిల్లీ ఎన్ సీఆర్ అత్యాచారం కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

- మిగతా 2లో




# భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

పెన్ పవర్ డెస్క్:భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగు తున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో

# వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

## మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరొత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

- మిగతా 2లో



# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

## సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు.తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# నిజం బయటపడ్డది..

- మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇవ్వడంపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన రాహుల్ గాంధీ.. ఫారమ్ 6లో మార్పులకు ఎటువంటి ఆమోదం తెలపలేదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్?పై ఫైర్ అయ్యారు.

'జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైంది. బీజేపీకి సహాయం చేయడానికి అతను తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు మాత్రమే. మన ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో పాలుపంచుకున్న జ్ఞానేష్?తో పాటు ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉంటారు" అని రాహుల్ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాత సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

**ఈసీ, కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు**

సర్ ప్రక్రియలో అవకతవకలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆయనను పదవి నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. అక్టోబర్ 5న ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో మిగిలిన ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

అంతేకాకుండా, ఫామ్ 6 మార్పులకు తాము ఎటువంటి ఆమోదం తెలపలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫామ్ 6?లో మార్పులు ఎవరు చేశారో రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. దేశంలోవ కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగించారన్న ఆరోపణల వేళ కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

నేరం పాల్పడే వారి మనసులో చట్టం పట్ల భయాన్ని కలిగించడం అవసరమని కోర్టు తెలిపింది. నేరం చేస్తే ఏం జరుగుతుందో , వాటి పరిణామాలకుభయపడకపోతే, అటువంటి నేరాలను నివారించడం కష్టమని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. సమాజంలోని ప్రతి మహిళ మన తల్లి, సోదరి వంటిది. మనం వారికి భద్రతా భావాన్ని కల్పించాలి. మనం ఇంట్లో మహిళల భద్రతను ఎలాగైతే నిర్ధారిస్తామో, సమాజంలో కూడా అలాగే చేయాలి. ఒక మహిళ బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తుంటే, పోలీసులకు ఆమె గురించి సమాచారం ఉండాలని, ఆమె భద్రతపై చురుకుగా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణ నవంబర్ 16కు వాయిదా వేసింది.

**నేరాలపై నిఘాకోసం వార్ రూం..**

నేరాల నియంత్రణకు ఓ వార్ రూం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఢిల్లీపోలీసులను ఆదేశించింది. నేరాలను అరికట్టడంలో ఢిల్లీ పోలీసులు ఏవైనా ప్రత్యేక చర్యలు చేపట్టారా.. వార్ రూం లాంటిది ఏర్పాటు ఏదైనా ఏర్పాటు చేశారా అని పోలీసులను ప్రశ్నించింది. జాతీయ డేటా బేస్ ద్వారా అనుమానిత క్రిమినల్స్, ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని అధికారులను కోర్టు కోరింది. మహిళలు, విద్యార్థులనుపదే పదే వేధించే వ్యక్తులు ఉన్నారని, అన్ని ఏజెన్సీలు కలిసి నిఘా ఉంచితే పరిస్థితిని చక్కదిద్ద వచ్చని తెలిపింది. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులకు వార్నింగ్ ఇచ్చింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 2012 నిర్భయ కేసును కూడా ప్రస్తావించింది. అనుమతి లేకుండా నడుస్తున్న హోటళ్లలో మద్యం కూడా అందిస్తున్న ప్రదేశాలపై దృష్టి సారించాలని కోర్టు ఢిల్లీ పోలీసులను కోరింది. 2012 నాటి ఘటనకు సంబంధించిన రికార్డుల ప్రకారం, నిందితురాలు నేరం చేయడానికి ముందు ఓ ప్రదేశంలో భోజనం , మద్యం సేవించినట్లు కోర్టు పేర్కొంది.ఢిల్లీలోని భద్రతా ఏర్పాట్లపై కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, పార్కులలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సొలిసిటర్ జనరల్ ను కోరింది. క్షేత్రస్థాయిలో పోలీస్ నిఘా, జవాబుదారితనం, నియంత్రణ చర్యల అవసరాన్ని ధర్మాసనం నొక్కిచెప్పింది.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# ఇంటింటికీ జలధార..

- మొదటి పేజీ తరువాయి

ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

**గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష
హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2029 నాటికి 4-స్టార్..

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్–స్టార్ పాఠశాలలన్నింటినీ టూ–స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో–స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్–స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4–స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5–స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్–స్టార్... 15,618 టూ–స్టార్... 19,099 త్రీ–స్టార్... 7,172 ఫోర్–స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట**

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు.ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు**

ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

**స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట**

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..
### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది.మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ చైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు.ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.

ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరోత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు.ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్'కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- మొదటి పేజీ తరువాయి

సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్–6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.అయితే ఫారమ్–6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది.ఫారమ్–6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్–1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్–6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**కేసు నేపథ్యం ఇదే..**

ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

# రెడ్ రిబ్బన్ క్విజ్‌లో పందిళ్లపల్లి హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ స్థానం



**బాపట్ల, అక్టోబర్ 5, (పెన్ పవర్ ):**
జిల్లా స్థాయిలో నిర్వహించిన రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గత నెల 25న బాపట్లలో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పృథివి షణ్ముఖేశ్వర్, ఇరపని లాస్యశ్రీల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది.
ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు గుర్తింపు తీసుకురావడం పట్ల ప్రధానోపాధ్యాయురాలు తలమల దీప్తి హర్షం వ్యక్తం చేశారు. విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# భారత్ కళా పురస్కార్--2026కు జగదీశ్ పిచ్చిక నామినేషన్ ఆమోదం



**పెడన, పెన్ పవర్, అక్టోబర్ 5**
ఫోటోగ్రఫీ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న జగదీశ్ పిచ్చికకు ప్రతిష్ఠాత్మక భారత్ కళా పురస్కార్--2026 నామినేషన్ ఆమోదమైంది. ఈ మేరకు నిర్వాహకులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ సమాచారం అందించారు. హైదరాబాద్‌లోని షామీర్‌పేట/శంషాబాద్ ప్రాంతంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ వేదికగా నిర్వహించనున్న ఫొటో ట్రేడ్ షోకు హాజరైన అనంతరం రిజిస్ట్రేషన్ కౌంటర్‌లోని అవార్డు డెస్క్ వద్ద హాజరును నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. అనంతరం అవార్డు డెస్క్‌ను సంప్రదించాలని తెలిపారు.
భారత్ కళా పురస్కార్--2026కు తన నామినేషన్ ఆమోదం పొందడంపై జగదీశ్ పిచ్చిక ఆనందం వ్యక్తం చేశారు.

# మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి
## ఈపురుపాలెంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన





**చీరాల, అక్టోబర్ 5 (పెన్ పవర్):**
చీరాల నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఈపురుపాలెం గ్రామంలోని సిండికేట్ వీవర్స్ కాలనీలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు గ్రామాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని తెలిపారు. పల్లెల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.
గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుంటూరులో పేదలకు 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి సి పి ఐ






**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 05,**
నగరంలోని అర్హులైన నిరుపేదలకు 2 సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా విజ్ఞాపన ధర్నా నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పేదలకు ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడం, దశాబ్దాలుగా ఇళ్లలో నివసిస్తున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి ముఖ్యఅతిథిగా, జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా విజ్ఞాపన ధర్నాలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అర్హులైన పేద ప్రజలు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. దీంతో అర్జీదారులు బారికేడ్లను సైతం లెక్కచేయకుండా పోలీసులను నెట్టుకుంటూ కలెక్టరేట్‌లోకి వెళ్లారు. తమకు 2 సెంట్ల ఇంటి స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతే లక్ష్యం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





**విజయవాడ,పెన్ పవర్,అక్టోబర్ 5:**
ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతతో పాటు సకాలంలో పరిష్కారం అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలను కేవలం సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి వదిలేయకుండా, సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుకు న్యాయబద్ధమైన, నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సంతృప్తినే అధికారుల పనితీరుకు ప్రధాన ప్రమాణంగా తీసుకోవాలని, పబ్లిక్ ఫీడ్‌బ్యాక్, ఐవీఆర్ఎస్, రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా ఆధారంగా పనితీరును సమీక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో లేకపోవడం, ఫిర్యాదులపై స్పందించకపోవడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. తిరువూరు, విజయవాడ వెస్ట్ జోన్, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సంతృప్తి తక్కువగా ఉండటంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అలాగే విజయవాడ డివిజన్, రూరల్ మండలం రెడ్‌లిస్ట్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని 14 మండలాల్లో 11 మండలాలు తీవ్ర కరువు పరిధిలో ఉన్నందున రైతులకు ప్రభుత్వ సహాయం సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల ప్రతి అర్జీ ప్రభుత్వంపై వారికి ఉన్న నమ్మకానికి ప్రతిబింబమని, కేవలం గణాంకాలు కాకుండా వాస్తవ సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. గ్రీవెన్స్ పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి అధికారి కట్టుబాటుతో పనిచేయాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు.

# అంగన్వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం
## ఈపురుపాలెంలో అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలకొండయ్య





**చీరాల, అక్టోబరు 5 (పెన్ పవర్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ సిబ్బందిని గౌరవించే ఉద్దేశంతో అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరాల మండలంఈపురుపాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సందర్శించారు.
ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యా కార్యక్రమాలు, మౌలిక వసతులను ఎమ్మెల్యే పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
సమాజఆరోగ్యంకోసంనిస్వార్థంగా సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సేవలందిస్తున్న ప్రతి అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్‌ను అభినందించారు.

# మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 5 :**
మానసిక ఆరోగ్య వారోత్సవాలు 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడం, మానసిక సమస్యలపై ఉన్న అపోహలను తొలగించడమే ధ్యేయంగా అక్టోబర్ 4 నుండి 10వ తేదీ వరకు నిర్వహించే “ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాల” ప్రత్యేక పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌సోమవారం ఆవిష్కరించారు. ఈ ఏడాది జీవిత అనుభవాలను విందాం : నిజమైన గొంతుకలు -- నిజమైన మార్పు”శీర్షికన అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ
ప్రస్తుత జీవన విధానంలో శారీరక ఆరోగ్యంతో పాటే మానసిక ఆరోగ్యం కూడా ఎంతో కీలకమన్నారు. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలతో బాధపడేవారిని చులకనగా చూడకుండా, వారి బాధలను ఆలకించి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. సమాజంలో మార్పు రావాలంటే బాధితుల నిజమైన స్వరాలు వినబడాలని, మానసిక సమస్యలు ఉన్నవారు ఎలాంటి సంకోచం లేకుండా నిపుణుల సహాయం తీసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారోత్సవాల సమయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యాసంస్థలలో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సమగ్ర వైద్య శాల మానసిక ఆరోగ్య విభాగ అధిపతి, ఆచార్యులు డా. ఉమా జ్యోతి మాట్లాడుతూ సమగ్ర వైద్య శాలలో బాలలు, కౌమార వెల్నెస్ క్లినిక్, వృద్ధుల వైద్య సంరక్షణ, శ్రేయస్సు, వారి ఆరోగ్య సమస్యల నివారణ విభాగం, ప్రజలకు అవగాహన కల్పించే వ్యవస్థ వ్యసనాలు, మాదక ద్రవ్యాల నుండి విముక్తి కల్పించే కేంద్రం టెలి మనస 14416 కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. సామాజిక పరిస్థితుల రీత్యా వైద్యుల వద్దకు వచ్చుటకు సందేహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సమగ్ర వైద్య శాల మానసిక ఆరోగ్య విభాగం సహ ఆచార్యులు డా. వి.వి.కిరణ్, సహాయ ఆచార్యులు డా.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆత్మగౌరవానికి ప్రతీక రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు
## ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు





**గుంటూరు:పెన్ పవర్, అక్టోబర్, 05,**
రైతుల భూములకు భద్రత, హక్కులకు భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ‘మీ భూమి.. మీ హక్కు’ కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. రీ-సర్వే పూర్తయిన 178 మంది రైతుల్లో 158 మందికి పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే అందజేశారు. మిగిలిన రైతుల సమస్యలను త్వరలో పరిష్కరించి వారికి కూడా పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాస్ పుస్తకంలోని క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవచ్చని, భూమి విస్తీర్ణం, హద్దులతో కూడిన మ్యాప్‌ను కూడా పాస్ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. గత ప్రభుత్వంలో రీ-సర్వే పేరుతో జరిగిన అవకతవకలకు చరమగీతం పాడుతూ, రైతుల భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాజకీయ నాయకుల ఫొటోలకు బదులుగా రాజముద్రతో పాస్ పుస్తకాలు అందించడం రైతులకు కొండంత బలమని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, గుంటూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు ఇమ్మడి లీలా మల్లేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు గంధం సురేష్‌తో పాటు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెనింజైటిస్‌పై అవగాహన అవసరం

## లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి






**పర్చూరు, అక్టోబరు 5 (పెన్ పవర్):**
ప్రపంచ మెనింజైటిస్ దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెనింజైటిస్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.
డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మెనింజైటిస్ అనేది మెదడు, వెన్నుపామును కప్పి ఉండే రక్షిత పొరలకు వచ్చే వాపు వ్యాధి అని తెలిపారు. బ్యాక్టీరియా, వైరస్‌ల ఇన్ఫెక్షన్ల కారణంగా ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. తీవ్రమైన తలనొప్పి, గందరగోళం, వెలుతురు చూడలేకపోవడం, వాంతులు, తీవ్రమైన జ్వరం, మెడ బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మెనింజైటిస్ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.
కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు కే. నాగరాజా, వైద్యశాలకు వచ్చిన రోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రెడ్ రిబ్బన్ క్విజ్‌లో పందిళ్లపల్లి హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ స్థానం




**బాపట్ల, అక్టోబర్ 5, (పెన్ పవర్ ):**
జిల్లా స్థాయిలో నిర్వహించిన రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గత నెల 25న బాపట్లలో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పృథివి షణ్ముఖేశ్వర్, ఇరపని లాస్యశ్రీల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు,జిల్లాకుగుర్తింపుతీసుకురావడంపట్లప్రధానోపాధ్యాయురాలు తలమల దీప్తి హర్షం వ్యక్తం చేశారు. విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ పారిపోతోంది: ఆళ్ళ హరి

**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 05,**
స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ నేతలు ఎన్నికలకు దూరంగా ఉంటున్నారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి విమర్శించారు. ప్రజలకు మొహం చూపించలేకే కోర్టుల చాటున దాక్కుంటున్నారని ఎద్దేవా చేశారు.
గుంటూరులోని 30వ వార్డులో జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆళ్ళ హరి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికలను నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ఇంకా మర్చిపోలేదని అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో వైసీపీ కార్పొరేటర్ల దాష్టీకాలను ప్రజలు మరచిపోలేదని విమర్శించారు. వైసీపీకి పార్టీ ఫండ్ ఇస్తామన్నా పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు.
ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని ఆళ్ళ హరి అన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుంటూరు నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని ఆళ్ళ హరి ధీమా వ్యక్తం చేశారు.



# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సత్కారం



**వేటపాలెం, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**
2026 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వేటపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించి అభినందించారు.
గత నెల 5న వేటపాలెం మండలానికి చెందిన ఎన్. సూర్యనారాయణ, డి. హేమంత్ కుమార్, ఎన్. శ్రీనివాసరావు, ఎస్. లలితా పరమేశ్వరి, ఎస్. నాగరాణి, డి. బేబీ కరుణశ్రీ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.
అలాగే ఈ విద్యా సంవత్సరంలో పొట్టి సుబ్బయ్యపాలెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 26 నుంచి 56కు పెంచిన ప్రధానోపాధ్యాయులు జి. మారుతిని కూడా ఘనంగా సత్కరించారు.
కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ఉపాధ్యక్షులు బి. బిక్షాలు బాబు, రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక నాయకులు కుర్రా రామారావు, మండల యూటీఎఫ్ అధ్యక్షులు పి. శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ ఆర్.వి. శ్రీనివాసరావు, యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి.

## పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లాకు వినతి.

**గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్**

**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 05:**
గిరిజన ప్రజలు సుమారుగా 2004 నుంచి సాగు చేసుకుంటున్న అటవి భూములకు పట్టాలు మంజూరు చేయాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా కు గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ కలెక్టర్ తో మాట్లాడుతూ రొంపిచర్ల మండలం, చాకలికుంట గిరిజన రైతులు జీవన భృతి కోసం సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు మంజూరు అయ్యేవిధంగా జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇలా చేయడం వలన బ్యాంకుల ద్వారా గిరిజన రైతులు రుణాలు పొందే వెసులుబాటు ఉంటుందన్నారు. సంబంధిత జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి బి. గోవింద్ నాయక్ కు ఈ సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా గిరిజన సమాఖ్య అధ్యక్షులు భూక్య సూర్య నాయక్, బి.రాంబాబు నాయక్, బధ్యా నాయక్ సోమ్ల నాయక్ తో పాటు పలువురు పాల్గొన్నారు.




# భవిష్యత్తు కోసం ఎదురు చూసేవారు కాదు... భవిష్యత్తును నిర్మించేవారు 'జెన్-జీ'

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 05:**
నేటి యువతరం భవిష్యత్తు కోసం ఎదురుచూసే తరం కాదని, సమాజ భవిష్యత్తును సరికొత్తగా నిర్మించే సత్తా ఉన్న తరమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. స్థానిక పాలడుగు నాగయ్య చౌదరి ఓ కొత్త రఘురామయ్య (పీఎన్‌సీ ఓ కేఆర్) నర్సింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన 'జెన్-జీ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ఆత్మీయంగా ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ చదువు, నైపుణ్యం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం అనే ఐదు ప్రధాన అంశాలను యువత తమ నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కేవలం సోషల్ మీడియాలో మాత్రమే కాకుండా నిజ జీవితంలో విజయాలు సాధించి, ఆ విజయాలను తమ కుటుంబానికే కాకుండా గ్రామానికి, నియోజకవర్గానికి, దేశానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. మీ భవిష్యత్తే మన నియోజకవర్గ భవిష్యత్తు మరియు దేశ భవిష్యత్తు అని విద్యార్థుల్లో ఉత్తేజం నింపారు. యువత బంగారు భవిత కోసం యువత భవితకు భరోసా పేరిట పది కీలక మార్గదర్శకాలను ఎమ్మెల్యే వివరించారు. కేవలం డిగ్రీ సర్టిఫికెట్లతో సరిపెట్టుకోకుండా కంప్యూటర్, ఆంగ్ల భాష, కమ్యూనికేషన్, డిజిటల్ స్కిల్స్ వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఉద్యోగాల కోసం మాత్రమే చూడకుండా స్టార్టప్‌లు, చిన్న వ్యాపార అవకాశాల ద్వారా ఇతరులకు ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నేటి సాంకేతిక విప్లవంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలు తీసేస్తుందని భయపడకుండా, దానిని అందిపుచ్చుకుని ఉపయోగించుకునే నైపుణ్యం సాధించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా నిజానిజాలు సరిచూసుకున్న తర్వాతే ఇతరులకు పంపాలని హెచ్చరించారు. సమయాన్ని ఎంతో విలువైనదిగా భావించి ప్రతిరోజూ స్కిల్ డెవలప్‌మెంట్, వ్యాయామం, కుటుంబానికి కేటాయించాలని సూచించారు. సరైన పోషకాహారం, వ్యాయామం,తగిననిద్రతోఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఒక్క తప్పుడు నిర్ణయం జీవితాన్ని నాశనం చేస్తుందని గుర్తుచేస్తూ మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే సంపాదన, పొదుపు, పెట్టుబడులు, అప్పుల విషయంలో సరైన డబ్బు నిర్వహణ అవగాహన కలిగి ఉండాలన్నారు. దేశం, సమాజం పట్ల బాధ్యతగా ఉంటూ ఓటు హక్కునుసద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒక్క పరీక్ష, ఒక ఉద్యోగం లేదా ఒక వ్యాపారంలో విఫలమైనంత మాత్రాన జీవితం ముగిసిపోదని, వైఫల్యాలకుకుంగిపోకుండాపట్టుదలతోమళ్లీ ప్రయత్నించాలని ధైర్యం చెప్పారు. అనంతరం విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చూపు కోల్పోయిన కుటుంబానికి రావెళ్ల కృష్ణ సేవా సమితి చేయూత



**చల్లపల్లి పెన్ పవర్ అక్టోబరు 5**
రామనగరం: లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలోని రామనగరానికి చెందిన దేసు నాంచారయ్య (50)కు రెండు కళ్ల చూపు తీవ్రంగా దెబ్బతింది. ఎడమ కన్ను పూర్తిగా కనిపించకపోగా, కుడి కన్నులో సుమారు 70 శాతం చూపు కోల్పోయారు. దీంతో రోజువారీ పనులు చేసుకోవడానికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాంచారయ్యకు భార్యతో పాటు సాయి అనే కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండటంతో జీవనం సాగించడం కష్టంగా మారింది. చూపు సమస్య కారణంగా ఉపాధి అవకాశాలుకూడాతగ్గిపోవడంతోకుటుంబఅవసరాలను తీర్చుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
ఈ విషయం గ్రామ తెలుగుదేశం కార్యకర్త పోసిన పోతురాజు ద్వారా తెలుసుకున్న రావెళ్ల కృష్ణ సేవా సమితి స్పందించి నాంచారయ్య కుటుంబానికి అండగా నిలిచింది. సేవా సమితి ఆధ్వర్యంలో రావెళ్ల ఉదయ్ రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ, అవసరమైన సమయంలో తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు.
ఆపదలో ఉన్న కుటుంబాలను గుర్తించి మానవతా దృక్పథంతో సహాయం చేయడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నాంచారయ్య కుటుంబానికి అందించిన ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సమాజంలో సేవా భావంతో ముందుకు వచ్చే దాతలు మరింత మంది ఇలాంటి నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

# పూర్తి చేసిన పనుల బిల్లులు తక్షణం అప్ లోడ్ చేయాలి





**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 5 :**
విబి జి రామ్ జి పథకం కింద పూర్తి చేసిన పనుల బిల్లులు శుక్రవారం నాటికి అప్ లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. వివిధ శాఖల ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విబి జి రామ్ జి క్రింద కొన్ని మండలాల్లో మంజూరు చేసిన పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం పట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ప్రశ్నించారు. ముందుగానే గుర్తించినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పల్లె పండగ 3.0 క్రింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాపై స్పష్టమైన పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడా తాగు నీటి ప్రమాణాలకు విరుద్ధమైన విలువలు లేకుండా చూడాలని ఆదేశించారు.
ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో అందిన అర్జీలపై స్పష్టమైన విచారణ చేపట్టి అర్జీదారు సంతృప్తి మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు లేని చిన్నారులకు త్వరితగతిన నమోదు చేయాలని స్పష్టం చేశారు. నైపుణ్య శిక్షణకు గ్రామీణ యువత నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎం.పి.డి.ఓలు ఇందులో క్రియాశీలంగా వ్యవహరించాలని చెప్పారు. డి.డి.యు - జి.కె.యు క్రింద శిక్షణ, ప్లేస్మెంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు అమలులో ప్రజలకు సంతృప్తికరంగా ఉండేందుకు పర్యవేక్షణ చేయాలని సూచించారు.
ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా ఉపాధి అధికారి ఎం. క్రిస్టీ అభినవ్, వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు ఆంజనేయులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు ఎస్. వెంకట రావు, జిల్లా ఎస్.జి.ఎస్.డబ్ల్యు అధికారి ఆర్.రామలింగేశ్వర రెడ్డి, ఎస్.జి.ఎస్.డబ్ల్యు సమన్వయ అధికారి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేటలో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే సాధారణ సమావేశం



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 05 :**
చిలకలూరిపేట పట్టణంలోని అమరావతి రెసిడెన్సీలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ సాధారణ సమావేశం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్,చిలకలూరిపేట అధ్యక్షులు అడపా అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సీనియర్ పాత్రికేయులు హాజరై తమ అమూల్యమైన సూచనలు,సలహాలు అందించారు.

**పాత్రికేయ వృత్తికి వన్నెతెచ్చేలా నడవడిక: అడపా అశోక్ కుమార్**

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అడపా అశోక్ కుమార్ పాత్రికేయుల జీవనశైలి, యూనియన్ విధివిధానాలపై సూచనలుఅందించారు. ముఖ్యంగా నూతనంగా జర్నలిజం రంగంలోకి అడుగుపెడుతున్న యువవిలేకరులకుఆయనదిశానిర్దేశంచేశారు.సమాజంలో విలేకరి అంటే కేవలం వార్తలు రాసే వ్యక్తి కాదని, ప్రజల పక్షాన నిలబడేబాధ్యతాయుతమైన గొంతుక అనిఆయనగుర్తుచేశారు.నిష్పాక్షికంగావ్యవహరిస్తూ,వృత్తిగత విలువలు కాపాడుకుంటూ నిజాయితీగా ఎలా నడుచుకోవాలోవివరించారు.యూనియన్‌బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలిపారు.

**కష్టకాలంలో ఐకమత్యమే శ్రీరామరక్ష**

రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి షేక్ మస్తాన్ మాట్లాడుతూవిలేకరులుక్షేత్రస్థాయిలో వార్తా సేకరణలో ఎదుర్కొనే సమస్యలు, వాటిని అధిగమించే వ్యూహాలనువివరించారు. విలేకరులకు ఎటువంటి కష్టం వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని, ఐకమత్యంతో నిలబడాల్సిన విజ్ఞప్తి చేశారు.

**ఐకమత్యమే మహాబలం**

ఎలక్ట్రానిక్‌మీడియాఅధ్యక్షులుఉప్పాల సుభాని,సెక్రటరీ సయ్యద్ సిద్దిక్ లు మాట్లాడుతూ "ఐకమత్యమే మహాబలం" అని ఉద్ఘాటించారు. మనలో మనంభేదాభిప్రాయాలు పక్కనపెట్టి కలిసికట్టుగా అడుగులు ముందుకు వేసినప్పుడే పాత్రికేయ వర్గానికి సమాజంలో మరింత గౌరవం, రక్షణ లభిస్తాయని స్పష్టం చేశారు.

**సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్తా రచన**

పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎన్.వి.ఎస్. ప్రసాద్‌వార్తారచనలోని మెలకువలను సోదాహరణంగా వివరించారు.వార్తలురాసేటప్పుడుఎటువంటిజాగ్రత్తలు పాటించాలి,వాస్తవాలను నిర్ధారణ చేసుకున్న తర్వాతే వార్తను ఎలా ప్రచురించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.కేవలం సమస్యను రాయడమే కాకుండా,వాటిని సంబంధిత అధికారుల దృష్టికి పకడ్బందీగా ఎలా తీసుకెళ్లాలి, పరిష్కారం దొరికేలా ఎలా ఫాలోఅప్ చేయాలి అనే అంశాలను విశదీకరించారు.

**సమాజంలో విలేకరుల పాత్ర అత్యంత కీలకం - సీనియర్ల సూచనలు**

ఈసమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులుధూళిపాళ్ల శ్రీకాంత్, సీనియర్ పాత్రికేయులు ఆలపాటిఆంజనేయులు, కొప్పుల కళ్యాణ్ చక్రవర్తి తదితరులుతమ సుదీర్ఘ అనుభవాలను పంచుకున్నారు. సమాజంలో రుగ్మతలను పారద్రోలి, సానుకూల మార్పు తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్రను ఎవరూ విస్మరించలేరన్నారు. విలువలతో కూడిన జర్నలిజం ద్వారా ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు తమ అనుభవాలను నూతన విలేకరులతో పంచుకుంటూ, పత్రికావృత్తికిభంగంకలగకుండాప్రతిఒక్కరూఆదర్శవంతంగానడుచుకోవాలని ముక్తకంఠంతో తీర్మానించారు. సమావేశంఅనంతరంపలువురుపాత్రికేయులు నాయకత్వాన్ని బలపరుస్తూ ఏపీయూడబ్ల్యూజే అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## అన్ని శాఖల్లో సామర్థ్యాల సద్వినియోగం అత్యంత కీలకంజిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 05,**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్)కీలకపాత్ర పోషించనుందని.. పారిశ్రామిక రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో ఎన్‌టీఆర్ జిల్లా చురుకైన పాత్ర పోషించగలదని ఆకాంక్షించారు.

నవ్య రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, దానిచుట్టూ ఉన్న జిల్లాలను అనుసంధానిస్తూ అమరావతి ఎకనామిక్ రీజియన్ పేరుతో భారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో భాగంగా మేధోమథన చర్చలు, వర్క్‌షాప్‌లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఏఈఆర్ ప్రణాళికపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఇందులో ఎల్ఈఏ అసోసియేట్స్ (ఏఈఆర్‌పీ) బృంద సభ్యులతో పాటు ప్రణాళిక, పరిశ్రమలు, ఏపీఐఐసీ, వ్యవసాయం, అనుబంధ రంగాలు తదితర శాఖల అధికారులు హాజరుకాగా ఎన్‌టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలతో కూడిన అమరావతి ఎకనమిక్ రీజియన్ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాలో సుస్థిర ఆర్థిక వృద్ధికి ఉన్న కీలక అవకాశాలపై చర్చించారు. హైటెక్ వ్యవసాయంతో పాటు క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికత అనుబంధ వృద్ధికీ అవకాశముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. జిల్లాలో సేవా రంగం ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషిస్తోందని.. తొలి సవరించిన అంచనాల ప్రకారం వర్తమానధరల వద్ద 2024-25 జీవీఏలో వ్యవసాయ రంగం వాటా 12 శాతం, పారిశ్రామికరంగం వాటా 21 శాతం కాగా సేవా రంగం వాటా 67 శాతంగా ఉందన్నారు. జిల్లాలో నేచురల్ ఫార్మింగ్‌తో పాటు ఫుడ్‌ప్రాసెసింగ్‌అభివృద్ధికీపుష్కలఅవకాశాలున్నాయనా న్రు. ఇప్పటికే జిల్లాలో 40 వేల మందికి పైగా ప్రకృతి సేద్యాన్ని అనుసరిస్తున్నట్లు వివరించారు. ఏడు నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చురుగ్గా అడుగులు పడుతున్నాయన్నారు. ఇన్వెస్టర్స్ డెస్క్, ల్యాండ్ బ్యాంకు చొరవతో పెద్దఎత్తున పెట్టుబడులను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ, ఐటీఈఎస్ భవిష్యత్తు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాల వృద్ధికి మరింత చొరవ చూపాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న పరిశ్రమలు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, జిల్లా దార్శనిక ప్రణాళిక, సామాజిక ఆర్థిక నివేదిక, విపత్తు నిర్వహణ ప్రణాళికపైనా చర్చించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం ద్వారా సుస్థిరమైన, సమగ్ర ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చని తద్వారా ఏఈఆర్‌లో కీలక ప్రాంతంగా జిల్లాను నిలబెట్టవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అమరజీవి జలధార పథకం ద్వారా ఏడాదిలో ప్రతి ఇంటికీ తాగునీరు..!
## శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

అమరజీవి జలధార పథకం ద్వారా ఏడాదిలో ప్రతి ఇంటికీ తాగునీరు..!
శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి





**పెన్ పవర్ కారంపూడి అక్టోబర్ 5 :--**

మాచర్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ప్రతి ఇంటికి శుద్ధమైన తాగు జలాలను అందించే లక్ష్యంగా జల్జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని పేటసన్నెగండ్ల అడ్డరోడ్డు వద్ద పల్నాడు వాటర్ గ్రిడ్ పైపు లైన్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 850 కోట్ల రూపాయలతో అన్నీ గ్రామంలో ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగు జలాలను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో వేలకోట్ల నిధులు అందించి, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంక్షేమాన్ని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు వెనుకబడిన మాచర్ల నియోజకవర్గం ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. సాగు,తాగునీరు ప్రాజెక్టుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలో వరికశెల ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పంగులూరి అంజయ్య,పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము మునుగోటి సత్యం, గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ బొమ్మిన శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణాల్లో అగ్నిమాపక భద్రతపై రూరల్ ఎస్.ఐ అవగాహన




**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 05 :**

చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాణసంచా (క్రాకర్) దుకాణాలను రూరల్ ఎస్.ఐ జి. అనిల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన షాపు యజమానులు, సిబ్బందికి అగ్నిమాపక భద్రతా నిబంధనలపై (ఫైర్ సేఫ్టీ) విస్తృత అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని ఈ సందర్భంగా దుకాణదారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## చంద్రబాబు పాలన ఏపీకి స్వర్ణయుగం.. జగన్ పాలన చీకటి యుగం :
## ప్రత్తిపాటిఅడుగడుగునా అభివృద్ధి.. అన్నివర్గాలు మెచ్చే సంక్షేమం.



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 05 :**

కేవలం వాగ్ధానాలకే పరిమితం కాకుండా.. ఆచరణాత్మక దృక్పథం, ప్రజల ఆశలు, ఆకాంక్షల దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగే సమర్థుడైన నాయకుడి పాలనలో ప్రజలకు ప్రతిరోజూ పండగేననే అభిప్రాయం రోజురోజుకీ బలపడుతోంది. ప్రజల మనసెరిగి పాలన చేసే నిజమైన ప్రజా ప్రభుత్వం ఇలా ఉండాలి.. ఉంటుందని కూటమి ప్రభుత్వం చేతలతో నిరూపిస్తోంది. కూటమి పాలన ఏపీకి స్వర్ణయుగమైతే..... జగన్ పాలన ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేని చీకటి యుగం. అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనకు కూటమి అధిక ప్రాధాన్యమిస్తుంటే..అవినీతి,దుష్ప్రచారం,కుంభకోణా ల మాటున వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ల అపూర్వ కలయిక.. పట్టువదలని సంకల్పం.. ప్రజలకు మేలు చేయాలన్న వారి తపనకు ప్రధాని మోదీ అందిస్తున్న సహాయ సహకారాలు..రాష్ట్రానికి దేవుడిచ్చిన వరాలు.

అభివృద్ధిని ప్రారంభించడమే కాకుండా. పనుల్ని ప్రాధాన్యతాక్రమంలోపూర్తిచేసేదిశగాఆచరణాత్మకంగా కూటమి ప్రభుత్వం ఒక్కో అవాంతరాన్ని అధిగమిస్తూ ఉండటం శుభపరిణామం. మొన్న మదనపల్లెలో గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ కు అంకురార్పణ... నిన్న బుర్రిపాలెంలో 3డీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం... సోమవారం ప్రొద్దుటూరులో రూ.30వేల కోట్ల విలువైన జల్ జీవన్ మిషన్ పనుల ప్రారంభం.. ప్రతి కార్యక్రమం.. కూటమి ప్రభుత్వ ప్రగతి ప్రస్థానంలో గొప్ప మైలురాళ్లుగా నిలిచిపోనున్నాయి.

మదనపల్లెలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన హార్టీకల్చర్ హబ్.. రాయలసీమ ప్రాంత వ్యవసాయ రంగానికి మరింత ఊతమిస్తుందనే చెప్పాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు అందే మార్కెటింగ్, ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్, ఎగుమతి అవకాశాలు వారి ఆర్థిక ఉన్నతికి ఎంతగానో ఉపకరిస్తాయి. రైతు పండించే ప్రతి ఉత్పత్తికి మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఉద్యాన రైతులకు ఎనలేని లబ్ధి చేకూరుతుంది.

పేదల సొంతింటి కల అనే మహా యజ్ఞాన్ని సఫలం చేయాలన్న కృత నిశ్చయంతో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, అందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి పరిచయం చేశారు. గతంలో మాదిరి ఇంటి నిర్మాణంలో ప్రజలు ఎదుర్కొనే అనేక కష్టాలకు ఈ కొత్త టెక్నాలజీ ముగింపు పలుకుతుంది. 3డీ టెక్నాలజీతో ఇప్పటికే దుబాయ్, చైనా దేశాలు తమ ప్రజలకోసం అద్భుతమైన నిర్మాణాలు చేపడుతున్నాయి. సాంప్రదాయ నిర్మాణానికి భిన్నంగా.. తక్కువఖర్చు, ఎక్కువ నాణ్యతతో నిర్మించే 3డీ ఇళ్లతో ప్రజల్లో పాలకులపై ఉన్న నమ్మకం, విశ్వాసం రెట్టింపు అవుతాయి.

జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జలధార కింద ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యసాధనలో ఎన్డీయే ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. జేజేఎమ్ కింద పల్నాడు జిల్లాలో వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో పనుల అంచనాలు ఖరారు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీ జల్ జీవన్ మిషన్ ప్రాజెక్ట్ పనులు ఊపందుకున్నాయి. దానిలో భాగంగా నేడు ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు 30 వేలకోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడం రాష్ట్రానికే గర్వకారణం." అని ప్రత్తిపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కొత్త పెన్షన్ల కోసం 62,866 దరఖాస్తులు
## అనుమతుల కోసం మధ్యవర్తులకు డబ్బులు ఇవ్వొద్దు: కలెక్టర్ కృతికా శుక్లా



**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 05:**

పల్నాడు జిల్లాలో కొత్త పెన్షన్ల కోసం మొత్తం 62,866 దరఖాస్తులు ఆన్లైన్‌లో నమోదు అయినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శు క్లా సోమవారం విలేకరుల సమావేశం తెలిపారు. కలెక్టర్మాట్లాడుతూ వీటిలో 7,311 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, 70 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మరో 55,485 మంది లబ్ధిదారుల దరఖాస్తులను సంబంధిత శాఖల పరిశీలన కోసం రాష్ట్ర స్థాయికి పంపినట్లు కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర స్థాయిలో సంబంధిత శాఖల పరిశీలన పూర్తయిన అనంతరం అర్హతను బట్టి పెన్షన్ల మంజూరుపై తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ వెల్లడించారు. పెన్షన్ మంజూరు చేయిస్తామని చెప్పే మధ్యవర్తులు, ఇతర వ్యక్తులను నమ్మి ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు. పెన్షన్ మంజూరు పేరుతో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేయడం, అలాంటి అక్రమాలకు పాల్పడడం వంటి విషయాలు తమ దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త పెన్షన్ల ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం జరుగుతుందని, లబ్ధిదారులు ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అధికారిక ప్రక్రియను అనుసరించాలని కలెక్టర్ సూచించారు.

## బాపట్లలో రూ.5 కోట్లతో పోస్ట్ హార్వెస్టింగ్ టెక్నాలజీ కేంద్రం ప్రారంభం
## రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి..







**బాపట్ల, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో బాపట్లలో రూ.5 కోట్లతో నిర్మించిన పోస్ట్ హార్వెస్టింగ్ టెక్నాలజీ కేంద్రం నూతన భవనాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. చిల్లర గొల్లపాలెంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో అఖిలభారత సమన్వయ కోత అనంతర ఇంజినీరింగ్ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన పరిశోధన కేంద్రం, వర్క్‌షాప్, శిక్షణ కేంద్ర భవనాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కేంద్రంలోని ఇంక్యుబేషన్ సెంటర్, అధునాతన యంత్ర పరికరాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. పంటల కోత అనంతరం ప్రాసెసింగ్, నిల్వ, విలువ జోడింపు వంటి సదుపాయాల ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించేలా ఈ కేంద్రం దోహదపడుతుందని తెలిపారు.

కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి., ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
## చీరాల శక్తి టీం ఆధ్వర్యంలో ఎన్.పి.ఆర్ విద్యా హైస్కూల్‌లో అవగాహన సదస్సు







**చీరాల, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని, సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చీరాల సబ్‌డివిజన్ శక్తి టీం పోలీసులు సూచించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, డీఎస్పీ మోయిన్ సూచనలతో, చీరాల 1 టౌన్ సీఐ సోమశేఖర్ పర్యవేక్షణలో సాల్మన్ సెంటర్ సమీపంలోని ఎన్.పి.ఆర్ విద్యా హైస్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా శక్తి టీం కానిస్టేబుల్ కె. సుబ్బారావు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పోక్సో చట్టం, సెల్ఫ్ డిఫెన్స్ మెళకువలు, అత్యవసర సమయంలో రక్షణ కల్పించే 'శక్తి యాప్' వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో అపరిచితుల సందేశాలు, అనుమానాస్పద లింకులకు స్పందించవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.

ఆపద సమయంలో 100, 112, 181, 1972, 1091, 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందిస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అద్వైత్ కుమార్ సింగ్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

అక్టోబర్ 5,: తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) అద్వైత్ కుమార్ సింగ్, ఐఏఎస్ (2013) సోమవారం స్వీకరించారు.

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో కోఆర్డినేషన్ (కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు అండ్ కేంద్ర ప్రాయోజిత పథకాలు) ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న అద్వైత్ కుమార్ సింగ్‌కు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ పదవికి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం.1441, సాధారణ పరిపాలన శాఖ ఈనెల 3 వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. రెసిడెంట్ కమిషనర్ బాధ్యతలతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, కేంద్ర



ప్రాయోజిత పథకాలకు సంబంధించిన సమన్వయ బాధ్యతలను కూడా ఆయన కొనసాగించనున్నారు.

## ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధారల ప్రత్యేక పైలాన్

## రూ. 30,156 కోట్ల తాగు నీటి ప్రాజెక్టుల వివరాలతో అమృత్ నగర్ కూడలిలో ఏర్పాటు



**అమరావతి, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార ప్రాజెక్టులకి సంబంధించిన ప్రత్యేక పైలాన్ ను ప్రొద్దుటూరు పట్టణంలోని, అమృత్ నగర్ కూడలిలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ కలిసి ఆవిష్కరించారు. జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార ద్వారా చేపడుతున్న భారీ తాగునీటి ప్రాజెక్టుల వివరాలను ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా ఈ పైలాన్ ను ఏర్పాటు చేశారు. రూ.30,156 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న తాగునీటి సరఫరా, సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు, మల్టీ విలేజ్ స్కీమ్స్, గ్రామీణ నీటి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రధాన ప్రాజెక్టుల వివరాలు ఈ పైలాన్‌లో పొందుపరిచారు. అందులో గండికోట జలాశయం నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో నిర్మిస్తున్న ప్రాజెక్టులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,000 గ్రామాల్లో చేపట్టిన సింగిల్ విలేజ్ స్కీమ్స్, 28 జిల్లాల పరిధిలో చేపట్టిన ప్రాజెక్టుల వివరాలు ప్రజలకు సులభంగా అర్థమయ్యేరీతిలో ఫలకాలపై చెక్కారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు చేర్చాలన్న లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార పనులను ఎంతో బాధ్యతాయుతంగా ముందుకు తీసుకువెళ్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, స్థానిక శాసన సభ్యులు నంద్యాల వరదరాజులు రెడ్డి, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాకా వెంకటస్వామి సేవలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## -మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాకా వెంకటస్వామి జీవితాంతం కృషి చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్ర భారతిలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) 97 వ జయంతి వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ వెంకట్ స్వామి, ఎమ్మెల్యే వినోద్ కుమార్ , ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ వంశీ కృష్ణ , ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, అంజన్ కుమార్ యాదవ్, సాంస్కృతిక శాఖ సెక్రెటరీ వాణి ప్రసాద్ , ఇతర ముఖ్య నేతలు పాల్గొని వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,

కాకా వెంకటస్వామి గా తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ప్రజానాయకులు అని మంత్రి పొన్నం కొనియాడారు.

అణగారిన వర్గాల హక్కుల కోసం పార్లమెంట్ వేదికగా కాకా వెంకటస్వామి

బలంగా గళం వినిపించారని మంత్రి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలతో ఆత్మీయ సంబంధాలు కొనసాగించిన మహోన్నత వ్యక్తిత్వం కాకాది అని మంత్రి పొన్నం అన్నారు. విద్య ద్వారా పేద, బడుగు వర్గాల పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నది కాకా వెంకటస్వామి ప్రధాన ఆశయం అని.. అని ఆయన సేవలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని మంత్రి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని, ఆయన ఆశయాలను కొనసాగించడమే కాకా వెంకటస్వామి కి మనం అందించే నిజమైన నివాళి అని మంత్రి పొన్నం ప్రభాకర్



పేర్కొన్నారు. తన కొడుకు వ్యక్తిత్వాన్ని, తన కుటుంబ విలువలను ఎంతో గొప్పగా తీర్చిదిద్దిన వ్యక్తి వెంకట స్వామి అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నేడు ఆయన మన మధ్య లేకపోయినా,కాకా ఆలోచనలు, ఆశయాలు, చేసిన సేవలు మన మధ్యే ఉన్నాయని మంత్రి పొన్నం చెప్పారు. ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యుల్లో, ఆయనతో కలిసి పనిచేసిన వారిలో, ఆయనను అభిమానించిన ప్రతి ఒక్కరిలో ఆయన జ్ఞాపకాలు సజీవంగా ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. కాకా చూపించిన మార్గంలో మనం ముందుకు సాగుతూ, ఆయన ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేయాలని కోరారు.

నేడు రాజకీయాల్లో ఎవరెక్కడ ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా, కాకా సేవలను, ఆయన మంచితనాన్ని, ఆయన ఆలోచనలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు.

కరీంనగర్ జిల్లాల్లో కాకా వెంకట్ స్వామి , చొక్కరావు సత్యనారాయణ రావు హేమాహేమీ లు రాజకీయ ఉద్ధండులు ఉన్నారని మంత్రి పొన్నం తెలిపారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు వారి కుమారుడు వివేక్ తెలంగాణ ఉద్యమ సమయంలో స్వరాష్ట్రం కోసం ఉద్యమించాల్సిన వాటిపై మాకు సలహాలు సూచనలు చేసేవారని గుర్తు చేశారు.

## సీకా, హైదరాబాద్లో "జైలు పరిపాలనలో నాయకత్వం" శిక్షణ కార్యక్రమం ప్రారంభం



**హైదరాబాద్, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ న్యూఢిల్లీ సహకారంతో స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సీకా), హైదరాబాద్ ఆధ్వర్యంలో "జైలు పరిపాలనలో నాయకత్వం" అనే అంశంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 05 – 09 వరకు నిర్వహించబడుతోంది.

**ఈ శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్ల శాఖ**

కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, లడఖ్, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 23 మంది జైలు అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. వీరిలో డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు డిప్యూటీ జైలర్లు ఉన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొనడం ద్వారా అనుభవాలను పంచుకోవడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, జైలు పరిపాలనలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తోంది.

ఈ సందర్భంగా డా. సౌమ్య మిశ్రా (ఐపీఎస్) మాట్లాడుతూ, జైలు పరిపాలనలో భద్రత, క్రమశిక్షణను కాపాడటంతో పాటు ఖైదీల గౌరవం, మానవ హక్కులు మరియు సంక్షేమాన్ని పరిరక్షించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సమర్థవంతమైన జైలు నాయకుడు దృఢంగా, న్యాయంగా, క్రమశిక్షణతో పాటు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ, సిబ్బందికి సమర్థవంతమైన మార్గనిర్దేశం చేయడంతో పాటు ఖైదీల సంస్కరణ మరియు పునరావాసానికి కృషి చేయాలని ఆమె అన్నారు. జైలు నిర్వహణను మెరుగుపరచడం, జవాబుదారీతనాన్ని పెంపొందించడం కోసం క్రమం తప్పకుండా తనిఖీలు, జైలు పర్యవేక్షణ, మానవ హక్కుల పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం మరియు పర్యవేక్షణ వ్యవస్థలు ఎంతో కీలకమని డా. సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా ఖైదీలు, ఇతర బలహీన వర్గాలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఖైదీల ఫిర్యాదులను సత్వరం మరియు సమర్థవంతంగా పరిష్కరించే వ్యవస్థ అవసరమని ఆమె తెలిపారు.

ఐదు రోజుల శిక్షణలో అధికారులు చురుకుగా పాల్గొని, తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను తెలుసుకోవాలని డీజీ ప్రోత్సహించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని తమ తమ జైళ్లలో నాయకత్వం, తనిఖీలు, ఖైదీల సంక్షేమం, ఫిర్యాదుల పరిష్కారం, మానవ హక్కులు మరియు పునరావాసం వంటి అంశాల్లో ఆచరణాత్మకంగా అమలు చేయాలని ఆమె సూచించారు. శిక్షణ ముగింపులో అందుకునే ధ్రువపత్రాల కంటే, శిక్షణ అనంతరం అధికారులు తమ తమ జైళ్లలో తీసుకువచ్చే సానుకూల మార్పులు మరియు మెరుగుదలలే ఈ కార్యక్రమం విజయానికి అసలైన ప్రమాణాలని డా. సౌమ్య మిశ్రా పేర్కొన్నారు.

## సింగరేణి భవన్ ముట్టడించిన కల్వకుంట్ల కవిత

## హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళన

**సీఎండీ వచ్చి చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్**

**హైదరాబాద్,అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం తప్పించుకుంటోందని కవిత ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కు అని.. అది మీరు వేసే బిచ్చం కాదని కవిత



మండిపడ్డారు. కచ్చితంగా నెలకు రెండు రోజులు మెడికల్ బోర్డు పెట్టాల్సిందేనని కవిత స్పష్టం చేశారు.

సింగరేణి లాభాల్లో 35 శాతం బోనస్ ను కార్మికులకు ఇవ్వాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లు ఉన్న కార్మికులను విజిలెన్స్ పేరుతో వేధించవద్దని కవిత కోరారు.

కార్మికులను వేధిస్తూ అక్రమంగా ఉద్యోగాలు తొలగించిన వాళ్లకు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి సీఎండీ వచ్చి మాతో చర్చలు జరపాలని కవిత డిమాండ్ చేశారు.

## యూసీఐఎల్ వజ్రోత్సవాలు ఘనంగా

## యురేనియం తవ్వకం, శుద్ధిలో ఆరు దశాబ్దాల ప్రస్థానం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

అణుశక్తి విభాగం (డీఏఈ) పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలిమిటెడ్(యూసీఐఎల్) వజ్రోత్సవాలను జాదుగూడలోఘనంగా నిర్వహించింది. భారత్‌లో యురేనియంతవ్వకం,శద్ధిసామర్థ్యాలఅభివృద్ధితో పాటు దేశ అణువిద్యుత్ కార్యక్రమానికి సంస్థ అందిస్తున్నసేవలనుఈసందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ వేడుకలకు అణుశక్తి కమిషన్ ఆర్థిక విభాగ సభ్యురాలుసీమాజైన్‌ముఖ్యఅతిథిగాహాజరయ్యారు.సీనియర్‌అధికారులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, వివిధ రంగాల భాగస్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీమా జైన్ జాదుగూడలోని సీ అండ్ ఆర్‌అండ్‌డీ విభాగంలో ఏర్పాటు చేసిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పైలట్ ప్లాంట్‌ను పరిశీలించారు. జాదుగూడ భూగర్భ గనిలో 815 మీటర్ల లోతులో సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన డార్క్ మ్యాటర్ ల్యాబొరేటరీ నూతన ప్రదేశాన్ని కూడా సందర్శించారు.ఈ సందర్భంగా సీమా జైన్ మాట్లాడుతూ, ఆరు దశాబ్దాల శాస్త్రీయ సామర్థ్యం, సంస్థాగతఅనుభవం,దేశానికిఅంకితభావంతోఅందించిన సేవలకు యూసీఐఎల్ వజ్రోత్సవాలు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. భారత యురేనియం తవ్వకం, శుద్ధి రంగాలకు పునాదులు వేసిన డాక్టర్ హోమీజహంగీర్‌భాభాతోపాటునాటిమార్గదర్శకులకునివాళులర్పించాల్సినసందర్భమిదన్నారు.సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో తరతరాలుగా యూసీఐఎల్ ఉద్యోగులు అంకితభావంతోపనిచేస్తూ దేశ అణుశక్తి కార్యక్రమానికి బలమైన పునాది వేశారనిప్రశంసించారు. భవిష్యత్తులో అణుశక్తి వినియోగాన్ని మరింత విస్తరించాలనే భారత్ లక్ష్యానికి అనుగుణంగా సాంకేతికత, భద్రతా వ్యవస్థలు, మానవ వనరుల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.అణుశక్తి విభాగ కార్యదర్శి, అణుశక్తి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అజిత్‌కుమార్ మొహంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అణుశక్తి మిషన్‌లో భారత్ ముందడుగు వేస్తున్న నేపథ్యంలో నిరంతర ఆవిష్కరణలు, సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టులకు ప్రత్యేక అవగాహన సదస్సు

వజ్రోత్సవాల్లో భాగంగా నర్వాపహాడ్ సమాచార కేంద్రంలో తొలిసారిగా జర్నలిస్టుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మీడియా ప్రతినిధులు శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులతో సంభాషించి అణుశక్తి, రేడియేషన్ సాంకేతిక వ్యవస్థలపై సమగ్ర అవగాహన పొందారు. యూసీఐఎల్‌కు చెందిన యురేనియం గనులు, మిల్లింగ్ కేంద్రాలను మీడియా ప్రతినిధులు సందర్శించారు. గనుల కార్యకలాపాలు, ఖనిజ రవాణా, శుద్ధి ప్రక్రియలు, పని ప్రదేశాల్లో అమలు చేస్తున్న సాంకేతిక, భద్రతా విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డీఏఈ సాంకేతిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అణుశక్తికి సంబంధించిన పారిశ్రామిక, సామాజిక ప్రయోజనాలతోపాటు డీఏఈ అనుబంధ సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను ప్రదర్శించారు.

యూసీఐఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కాచం ఆనందరావు మాట్లాడుతూ, వజ్రోత్సవాలు యూసీఐఎల్ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. యురేనియం తవ్వకం, శుద్ధిలో నైపుణ్యం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు సాంకేతికత, భద్రత, పర్యావరణ నిర్వహణలో సంస్థ సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేస్తోందని తెలిపారు.

1967లో ఏర్పాటైన యూసీఐఎల్ దేశీయ యురేనియం తవ్వకం, శుద్ధి సామర్థ్యాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి ఖనిజ శుద్ధి, సాంకేతిక అభివృద్ధి, వృత్తిపరమైన భద్రత, రేడియేషన్ రక్షణ, పర్యావరణ నిర్వహణ వరకు ప్రత్యేక జాతీయ సామర్థ్యాన్ని నిర్మించింది. దేశ అణువిద్యుత్ కార్యక్రమానికి అవసరమైన కీలక వనరులను అందిస్తూ భవిష్యత్తు దిశగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

## స్వదేశీ 'ఏఐ విజన్ చిప్' అభివృద్ధికి 130 కోట్ల ఆర్థిక సహకారం

## బిగ్ఎండియన్ సెమీకండక్టర్స్‌తో టీడీబీ--డీఎస్టీ ఒప్పందం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5, (పెన్ పవర్) :**

దేశీయ సెమీకండక్టర్ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. స్వదేశీ ఏఐ విజన్ సిస్టమ్–ఆన్–చిప్ (రాశీజ) అభివృద్ధి కోసం బెంగళూరుకు చెందిన బిగ్ఎండియన్ సెమీకండక్టర్స్‌కు ?130 కోట్ల ఆర్థిక

**'ప్రాజెక్ట్ వీర్ఏఐ' ద్వారా నిఘా, రక్షణ, ఆటోమొబైల్, వైద్య రంగాలకు అత్యాధునిక చిప్‌లు**

సహాయం అందించేందుకు కేంద్ర శాస్త్ర--సాంకేతిక విభాగానికి చెందిన టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు ఒప్పందం కుదుర్చుకుంది.

రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ (RDI) ఫండ్ కింద ఈ సహాయాన్ని అందించనున్నారు. 'ప్రాజెక్ట్ వీర్ఏఐ' పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం ?260 కోట్లు. ప్రస్తుతం టెక్నాలజీ రెడీనెస్ లెవల్--5లో ఉన్న సాంకేతికతను వాణిజ్య వినియోగానికి సిద్ధమైన టీఆర్ఎల్--9 స్థాయికి తీసుకెళ్లడం దీని ప్రధాన లక్ష్యం. ఆప్షనల్ కన్వర్టిబుల్ డెట్ విధానంలో ఆర్థిక సహాయం అందించనున్నారు.

**సీసీటీవీ నిఘా వ్యవస్థలకు సురక్షిత చిప్**

కెమెరా ఆధారిత అనువర్తనాల కోసం సురక్షితమైన ఏఐ విజన్ చిప్‌ను స్వదేశీ సాంకేతిక వేదికపై అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యంగా సీసీటీవీ, నిఘా వ్యవస్థల అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందిస్తున్నారు. విదేశీ సెమీకండక్టర్లు, సాంకేతిక సరఫరా వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ **ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.**

ఏఐ ప్రాసెసింగ్, స్మార్ట్ ఫీచర్లతోపాటు భద్రత, గోప్యత, కనెక్టివిటీ సామర్థ్యాలను ఈ చిప్‌లో పొందుపరచనున్నారు. ప్రారంభంలో భారత్‌తోపాటు గ్లోబల్ సౌత్ దేశాల నిఘా అవసరాల కోసం అభివృద్ధి చేసి, అనంతరం రక్షణ, ఆటోమొబైల్, పారిశ్రామిక, వైద్య రంగాలకు విస్తరించనున్నారు.

**వాణిజ్య ఉత్పత్తిగా అభివృద్ధి**

భారత్‌లో పెరుగుతున్న వీఎల్ఎస్ఐ డిజైన్, సెమీకండక్టర్ నిపుణుల ప్రతిభను వినియోగించుకొని విస్తృత స్థాయిలో ఉత్పత్తి చేయగల వేదికగా దీనిని తీర్చిదిద్దనున్నారు. సాధారణ ప్రయోజనాల చిప్‌లకు బదులుగా పరిశ్రమల ప్రత్యేక అవసరాలకు అనుగుణమైన చిప్‌ల అభివృద్ధిపై ప్రాజెక్టు దృష్టి సారిస్తుంది.

ఆర్‌డీఐ నిధులతో సాంకేతిక అభివృద్ధి, ధ్రువీకరణ, అనుసంధానం, పరీక్షలు, భారీ స్థాయి ఉత్పత్తికి అవసరమైన కార్యకలాపాలను బిగ్ఎండియన్ సెమీకండక్టర్స్ చేపట్టనుంది.

సెమీకండక్టర్లు దాదాపు ప్రతి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు పునాది వంటివని టీడీబీ కార్యదర్శి రాజేశ్ కుమార్ పాఠక్ పేర్కొన్నారు. దేశీయంగా ప్రత్యేక అవసరాలకు ఉపయోగపడే ఏఐ చిప్‌లను అభివృద్ధి చేయడం ద్వారా భారత సాంకేతిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు.

టీడీబీ అందిస్తున్న సహకారం 'ప్రాజెక్ట్ వీర్ఏఐ' అభివృద్ధి, పరీక్షలను వేగవంతం చేసి, చిప్‌ను వాణిజ్య వినియోగానికి సిద్ధం చేసేందుకు దోహదపడుతుందని బిగ్ఎండియన్ సెమీకండక్టర్స్ ప్రతినిధులు వెల్లడించారు.

# యూటర్న్ తీసుకున్న చంద్రబాబు, పవన్.. పులివెందుల పర్యటనలో మార్పు



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంయుక్తంగా నిర్వహించిన కడప జిల్లా పర్యటన రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం జగన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో కాకుండా చంద్రబాబు, పవన్ కార్యక్రమం ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సాగడంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. పులివెందుల పర్యటనకు వస్తారనగా, అందుకు రెండు రోజుల ముందు సీఎం, డీసీఎం టూర్ షెడ్యూల్ మారిపోవడంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

జలజీవన్ మిషన్ అమరజీవి జలధార 2.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కడప జిల్లాలో పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30,156 కోట్ల వ్యయంతో జలధార పనులు చేపడుతున్నారు. ఇందుకు ప్రొద్దుటూరులో పైలాన్ ఆవిష్కరించారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు సరఫరా చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అయితే ముందుగా జలధార 2.0 కార్యక్రమాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో నిర్వహించాలని భావించారు. పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ ను ఆహ్వానించి, వేదికపై నుంచి ఆయనను ఇరుకన పెట్టే కార్యక్రమానికి డిజైన్ చేశారని చెబుతున్నారు.ఇక ముఖ్య నేతలు ఇద్దరూ పులివెందుల పర్యటనకు సిద్ధమవడం రాజకీయంగా వేడెక్కించింది. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జగన్ సొంత ఇలాకాలో చంద్రబాబు, పవన్ వెళుతున్నారని ప్రచారం జరిగింది. ఇక ఇప్పటికే పలు అంశాల్లో జగన్ ను టార్గెట్ చేస్తున్న కూటమి ప్రభుత్వ అధినేతలు పులివెందులలో ఏ రాజకీయ బాంబు పేల్చుతారో అంటూ అంతా ఉత్కంఠగా ఎదురుచూశారు. కానీ, ఏమైందో ఏమో అనూహ్యంగా పులివెందుల కార్యక్రమాన్ని ప్రొద్దుటూరుకు మార్చేశారు. దీంతో కూటమి కార్యకర్తలు తీవ్ర నిరాశను వ్యక్తం చేశారు. మరోవైపు పులివెందుల కార్యక్రమం అంటూ హడావుడి చేసిన ప్రభుత్వం వెనక్కి తగ్గడంపై అనేక విధాలుగా చర్చ జరుగుతోంది.

అయితే పులివెందులలో జలజీవన్ మిషన్ కార్యక్రమం ఉంటుందని అధికారికంగా ప్రకటన చేయలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కడప జిల్లాలో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం భావించిందని, ఇందుకోసం పలు నియోజకవర్గాలను పరిశీలించామని మాత్రమే చెబుతున్నారు. సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి స్వయంగా ఆహ్వానించడంతో

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేశారని అంటున్నారు. అయితే పులివెందుల పర్యటన వాయిదా వేయడానికి ఇంకో కారణం ఉందని స్థానికంగా ఒక ఆసక్తికర అంశం ప్రచారం జరుగుతోంది.వాస్తవానికి గత నెల 30న పులివెందులలో ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించారని, ఇందుకోసం పులివెందులలో తాగునీటి గ్రిడ్ ప్రాజెక్టు పనులు శరవేగంగా చేపట్టారని అంటున్నారు. అయితే కార్యక్రమం నిర్వహించాల్సిన సమయంలో ప్రధానమైన చిత్రావతి రిజర్వాయర్ లో నీరు లేకపోవడంతో కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారని అంటున్నారు. నీళ్లు లేకుండా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభిస్తే విమర్శలు ఎదుర్కోవాల్సివస్తుందనే ఆలోచనతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గండికోట జలాశయం వద్దకు కార్యక్రమానికి మార్చారని అంటున్నారు. ఇక సీరియర్ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి కూడా కార్యక్రమం నిర్వహించేందుకు ఉత్సాహం చూపడంతో సీఎం, డిప్యూటీ సీఎం ప్రొద్దుటూరు పర్యటనకు మొగ్గుచూపారని చెబుతున్నారు.

# మాధవ్ కెపాసిటీ, క్యాలిబర్ కు ఇది ఒక టెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కు విశాఖ లోకల్ బాడీ ఎన్నికల టెన్షన్ పట్టుకుంది. మాధవ్ సొంత ప్రాంతం కావడంతో ఇక్కడ పట్టు నిలుపుకోవడం ఆయనకు అవసరంగా కనిపిస్తుంది. ఇప్పటికే మాధవ్ కు స్థానిక బీజేపీ నేతల నుంచి వత్తిడి పెరుగుతోంది. విశాఖ మేయర్ పదవిని బీజేపీ దక్కేలా చూడాలని కార్యకర్తల నుంచి ప్రెషర్ పెరుగుతోంది. అందుకే మాధవ్ తమకు గత అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన పొత్తులతో సంబంధం లేకుండా విశాఖ కార్పొరేషన్ కేటాయించాలని మాధవ్ కోరే అవకాశాలున్నాయి. సొంత ప్రాంతంలో పట్టు నిలుపుకో లేకపోతే ఇటు పార్టీలో అటు నాయకత్వంలోనూ పరువు పోతుంది. అందుకే మాధవ్ ఎలాగైనా పట్టుబట్టి విశాఖ మేయర్ స్థానాన్ని బీజేపీకి దక్కించుకునేలా చూడాలని భావిస్తున్నారు. ఇప్పటికే మాధవ్ దీనిపై ఒక ప్రకటన కూడా చేయడంతో ఆయన కూటమి సమావేశంలో కొంత కటువుగానే మాట్లాడే అవకాశాలు ఉండొచ్చన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా వినిపిస్తుంది.

**టీడీపీ కూడా బలంగా...**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు విశాఖపట్నం స్థానిక సంస్థలు మరియు జీవీఎంసీ మేయర్ పీఠంపై కూటమిలో నెలకొన్న రాజకీయ పోరు ఉత్కంఠను రేపుతోంది. విశాఖపట్నంలో జీవీఎంసీ మేయర్ పదవిని దక్కించుకోవాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తుండగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ పార్టీ కూడా పట్టుదలగా ఉంది. మరొకవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిది కూడా విశాఖపట్నమే కావడంతో కొంత పట్టుబట్టే అవకాశాలున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా విశాఖలో సీట్ల సర్దుబాటు, మేయర్ స్థానం ఎవరికి దక్కుతుందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఎవరిని ఎవరు ఒప్పించగలరు? అన్న దానిపై మాధవ్ కెపాసిటీ, క్యాలిబర్ లు ఆధారపడి ఉంటాయన్నది పార్టీ నేతల నుంచి కార్యకర్తలు వరకూ అంటున్న కామెంట్స్.

**మాధవ్ వ్యూహం ఇదే అయినా...**

విశాఖ కేంద్రంగా పార్టీని బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో బీజేపీ జెండా ఎగరాలని, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కేడర్‌కు పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశం చేశారు. మేయర్ స్థానానికి పోటీపై తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అయితే మాధవ్ మాటకు ఎంత మేరకు టీడీపీ నుంచి సానుకూలత లభిస్తుందన్నది సందేహమే. ఎందుకంటే విశాఖపట్నంలో అనేక పరిశ్రమలు వస్తున్నాయి. అక్కడ మేయర్ పీఠంపై టీడీపీ ఇప్పటికే గురి పెట్టి ఉంది. అతి పెద్ద కార్పొరేషన్ కావడంతో ఈ స్థానాన్ని వదులుకునేందుకు విశాఖ టీడీపీ నేతలతో పాటు పార్టీ నాయకత్వం కూడా సిద్ధంగా ఉండకపోవచ్చు. బీజేపీ కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుంటుందా? లేదా? అన్నది ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఢిల్లీ జోక్యం అంతగా ఉండదంటున్నారు. మరి మాధవ్ వల్ల మేయర్ అభ్యర్థిత్వం బీజేపీకి దక్కితే కొంత వరకూ ఆయన విజయం సాధించినట్లే. ఇక గెలుపోటములు కూడా ఆయనకు మరొక సవాలుగా మారే అవకాశముంది.

# బీసీ రిజర్వేషన్లు ...ఓటు బ్యాంక్ డ్రామాలు

**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు ఈ జీవోలు విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఆరు వారాల్లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినప్పటికీ, న్యాయపరంగా ఇది నిలబడదని తెలిసి కూడా వేస్తున్న రాజకీయ ఎత్తుగడగానే స్పష్టమవుతోంది.రాజ్యాంగబద్ధమైన పరిమితులను అధిగమించి రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని రాజ్యాంగ ధర్మాసనాలు ఎన్నోమార్లు స్పష్టం చేశాయి. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. స్థానిక సంస్థల్లో రాజకీయోచిత వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు త్రిసభ్య కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించకుండా , 50 శాతం సీలింగ్‌ను దాటుకుని ఏ రాష్ట్రమూ రిజర్వేషన్లు పొడిగించకూడదని పేర్కొంది. ఈ తీర్పులు ఉన్నప్పటికీ 34 శాతం కోటాతో జీవోలు తెచ్చి, అది కోర్టుల్లో చెల్లదని తెలిసీ సుప్రీంకోర్టుకు వెళ్లడం కేవలం రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతోంది. ఈ తరహా రాజకీయ వ్యూహాలు తెలుగు రాష్ట్రాలకు కొత్తవేమీ కావు. ఉమ్మడి ఏపీ సమయం నుంచి మొన్నటి తెలంగాణ పంచాయతీ ఎన్నికల వరకు కూడా ప్రభుత్వాలు 50 శాతానికి మించి బీసీ కోటాను పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, న్యాయస్థానాలు వాటిని అడ్డుకోవడం క్రమబద్ధమైన పరిణామంగా మారింది. తెలంగాణలోనూ బీసీ రిజర్వేషన్లపై గతంలో తెచ్చిన ఆర్డినెన్సులు కోర్టుల్లో నిలబడలేక చివరకు 50 శాతం లోపే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకోకుండా లేదా తెలిసీ విస్మరించి, ఎన్నికల ముందు భారీ రిజర్వేషన్ల హామీలు ఇవ్వడం ఒక అనవసర సంప్రదాయంగా మారింది. ఈ తరహా పరిమితికి మించిన రిజర్వేషన్ల హామీలు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఇచ్చేవి కావు. ఇవి ప్రధానంగా ఓటు బ్యాంకులను ఆకట్టుకునేందుకు ఆడే రాజకీయ క్రీడ. బీసీ వర్గాల్లో అత్యాశలు, ఆకాంక్షలు రేకెత్తించడం, ఆపై జీవోలను సిద్ధం చేయడం, న్యాయస్థానాలు రాజ్యాంగ చట్రంలో వాటిని కొట్టేయగానే మేము బీసీలకు న్యాయం చేయాలని చూశాం, కానీ కోర్టులు అడ్డుకున్నాయి అంటూ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం రాజకీయ పార్టీల పరిపాటిగా మారింది. దీనివల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగకపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు సుదీర్ఘకాలం పాటు వాయిదా పడి స్థానిక పాలన స్తంభించిపోతోంది. వాస్తవానికి, బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా క్షేత్రస్థాయి డాటాను సేకరించి, రాజ్యాంగ సవరణల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. లేదా 50 శాతం పరిమితికి లోబడే బీసీలకు గరిష్ఠంగా లబ్ధి చేకూరేలా సీట్ల కేటాయింపు చేయాలి. కానీ, ఆచరణాత్మక పరిష్కారాలను విస్మరించి, న్యాయపోరాటం పేరుతో కాలయాపన చేయడం వల్ల సమయం, ప్రజాధనం వృథా కావడం తప్ప మరే ఫలితం ఉండదు. హైకోర్టు తీర్పు ను బట్టి చూస్తే సుప్రీంకోర్టుకు వెళ్లినా ఏపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశాలు అత్యల్పం. కాబట్టి కోర్టుల వల్ల జరగలేదనే రాజకీయ నెపం నెట్టడం ఆపి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే ప్రజాస్వామ్య బద్ధమైన మార్గం. బీసీ సమాజం కూడా కేవలం కాగితాలపై ఇచ్చే 34 శాతం హామీల కంటే, చట్టబద్ధంగా అమలుకు సాధ్యమయ్యే ప్రాతినిధ్యంపైనే స్పష్టమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**డేటాను పూర్తిగా పరిశీలించకుండానే**

2025 డిసెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ సర్వే నిర్వహించింది. రాష్ట్ర జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగం, ఇళ్లు, ఆస్తుల స్థితిగతులతో పాటు అన్ని కీలక వివరాలను సేకరించింది. 2026 జూన్‌లో ఈ వివరాలను స్థానిక సంస్థల ముందుంచి ప్రజలు వెరిఫై చేసుకునే అవకాశం కల్పించింది. మొత్తం 39 అంశాలపై సామాజిక ధ్రువీకరణ చేపట్టారు. ఈ డేటా ఆధారంగా రాష్ట్ర జనాభాలో బీసీలు దాదాపు 50.42% (గ్రామీణ ప్రాంతాల్లో 48.84%, పట్టణాల్లో 54.35%) ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 1/3వ వంతు, గ్రామీణ స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు కల్పించడానికి రెండు జీవోలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావ్ గావ్లీ, సురేష్ మహాజన్, బిర్రు ప్రతాప్‌రెడ్డి కేసుల్లో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50%కి మించకూడదంటూ ప్రతివాదులు ఈ జీవోలను హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తీర్పులు వెలువడే నాటికి, నేటికీ పరిస్థితులు మారాయని సమగ్ర కుటుంబ సర్వే తేల్చిందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. రాజకీయ రిజర్వేషన్లను కేవలం జనాభా ఆధారంగా కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా చేపడుతున్నట్లు హైకోర్టుకు వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ రిజర్వేషన్లు 50%కి మించకూడదన్న కారణంతో హైకోర్టు ఆ రెండు జీవోలను రద్దు చేసింది.కె.కృష్ణమూర్తి, వికాస్ గావ్లీ కేసుల్లో తీర్పులను లోతుగా విచారించి సేకరించిన డేటా అందుబాటులో ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించొచ్చు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని స్థానిక సంస్థలన్నీ ధ్రువీకరించాయి. ఆ ప్రక్రియ సరిగా జరిగిందా లేదా అని పరిశీలించడానికి బదులు హైకోర్టు దాన్ని పూర్తిగా రద్దు చేయడం సరికాదని సుప్రీంకోర్టు పిటిషన్‌లో పేర్కొంది. రిజర్వేషన్లపై 50% పరిమితి అన్నివేళలా తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనేమీ కాదని ‘జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా’ కేసులో సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని ఏపీ ప్రభుత్వం గుర్తుచేసింది. స్థానిక సంస్థల పాలక వర్గాల కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో ఎన్నికలు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుకు తగిన కసరత్తు చేసిందని, కేవలం జనాభా ప్రాతిపదికన ఉజ్జాయింపుగా బీసీలకు 34% రిజర్వేషన్లను ఖరారు చేయలేదని స్పష్టం చేసింది.

## సవాళ్లతో ఏకం... సాధ్యమేనా

**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఏపీ ఎన్నికల్లో తన సర్వేల ద్వారా సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన ‘కేకే సర్వేస్’ అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు డైరెక్ట్ రాజకీయాల్లోకి రంగప్రవేశం చేస్తున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల అంచనాలు చెప్పిన ఆయన, ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ స్టార్ హోటల్‌లో ప్రత్యేకంగా మీటింగ్ ఏర్పాటు చేసి ‘ఏకం’ అనే కొత్త రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి, అర్హత ఉన్న సాధారణ ప్రజలను ప్రోత్సహించడమే ఈ ‘ఏకం’ పార్టీ ప్రధాన లక్ష్యమని కిరణ్ తెలిపారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజలను ఒకే వేదికపైకి తెచ్చి రాజకీయాల్లోకి తీసుకురావడమే తన ధ్యేయమన్నారు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల నుంచి మొదలుపెట్టి, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏకం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు.గతంలో కొన్ని ఎన్నికల ఫలితాలను అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చిన కిరణ్ కొండేటి, ఆ తర్వాత ఇచ్చిన కొన్ని సర్వే అంచనాలు తలకిందులు కావడంతో సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కొన్నారు. సర్వేల పేరుతో ప్రజల ముందుకు వెళ్తే ఇక ఫలితం ఉండదనే వాస్తవాన్ని గుర్తించే ఈసారి నేరుగా రాజకీయాల్లోకి వస్తున్నారని ప్రచారం సాగుతోంది.ఏపీలోని స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూప్ తగాదాలు, బలమైన కేడర్, భారీగా డబ్బుతో ముడిపడి ఉండే సున్నితమైన అంశం. కేవలం ఒక వేదికను సృష్టించి ఆసక్తి ఉన్నవారికి అవకాశం ఇస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నడపడం, ఎన్నికల ఖర్చులను భరించి గెలవడం అంత తేలికైన విషయం కాదనే ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. సర్వేల పేరిట సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన ఆయన..కొత్త రాజకీయ ప్రయాణంలో ఏ మేరకు రాణిస్తారనేది వేచి చూడాలి.

## అప్పాజీపేటలో అర్ధరాత్రి మిస్టరీ

**అనంతపురం అక్టోబరు 5, పెన్ పవర్:** అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో.. ఎలా పడుతున్నాయో అర్థం కాక గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా పెట్టిన సమయంలో ఈ రాళ్లు పడ్డాయి. దీంతో ఇది ఏ దెయ్యం పనో అని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్వామిజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. అయితే ఆకతాయిల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నట్టు తెలుస్తుంది. ప్రజలు మాత్రం రాత్రిపూట నిద్రపోలేకపోతున్నామని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించమని కోరుతున్నారు.అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో ఓ వింత పరిస్థితి నెలకొంది. ఆ గ్రామంలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. ఈ పరిణామంతో రాత్రైతే చాలు వణికిపోతున్న జనం.. ఆ ఊర్లో ఉండాలంటే భయపడిపోతున్నారు. ఈ ఘటన వల్ల ఇప్పటికే చాలా ఇళ్లు డ్యామేజ్ అయ్యాయి. ఇళ్ల పైకప్పులు పగిలిపోయాయి. ఆ రాళ్లు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలియక ఆ ఊరి ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. రాత్రి పూట అందరూ ఒకే చోటకు చేరుతున్నారు. ఈ విషయంపై ప్రజలు రకరకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఎవరైనా కావాలనే చేస్తున్నారా? దైవం పనా? దెయ్యం పనా? అనే ఊహాగానాలు జోరందుకున్నాయి.ఈ బాధ భరించలేక ప్రజలు చివరి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తర్వాత నలుగురు పోలీసులు ఆ గ్రామంలో గస్తీ కూడా నిర్వహించారు. ఆ సమయంలో కూడా గాల్లోంచి రాళ్లు పడ్డాయి. అయినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై ప్రజలు స్వామీజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. పోలీసులతో పాటు సుమారు 20 మంది యువకులు కూడా ఈ మిస్టరీని ఛేదించడానికి కొండపైకి వెళ్లి పరిశీలించారు. అప్పుడు కూడా ఇళ్లపై రాళు వచ్చి పడ్డాయి.దీంతో ఆ గ్రామ ప్రజలు ఇది కచ్చితంగా అదృశ్య శక్తుల పనే.. అని అనుమానిస్తున్నారు. అయితే అలాంటి దానికి ఆస్కారం లేదని, ఇది ఆకతాయిలు చేస్తున్న పనిగా కనిపిస్తుందని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే పోలీసులు నిఘా ఉన్న సమయంలో రాళ్లు ఎలా పడుతున్నాయో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు వ్యక్తులే కావాలనే రాళ్లు విసురుతూ భయాందోళనకు గురి చేస్తున్నారా? దీనికి ఇంకేదైనా కారణముందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతుంది. అయితే రాళ్ల దాడి వల్ల ప్రజలు రాత్రిళ్లు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఎక్కువగా సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాళ్లు పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. చాలామంది గ్రామానికి వచ్చి వీడియోలో, ఫోటోలు తీసుకెళ్తున్నారని కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. దీంతో తమకు భద్రత కల్పించాలని గ్రామస్థులు పోలీసులను కోరుతున్నారు.అయితే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలా జరిగిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రకాశం జిల్లా, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని గ్రామాల్లో అచ్చం ఇలాగే రాత్రైతే ఇళ్లపై రాళ్లు పడేవి. ‘జన విజ్ఞాన వేదిక’ ప్రతినిధులు, పోలీసులు నైట్ విజన్ కెమెరాలు పెట్టి దర్యాప్తు చేశారు. ఆ విచారణలో గ్రామస్థులే ఆస్తి తగాదాల వల్ల ఈ రాళ్లు విసిరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పాజీపేటలో కూడా పోలీసులు సాధారణ గస్తీని నిర్వహించే బదులు సీసీ కెమెరాలు, డ్రోన్లు లేదా నైట్ విజన్ కెమెరాలు ఉపయోగిస్తే ఈ రాళ్ల వాన మిస్టరీ త్వరగా వీడే అవకాశం ఉంటుంది.

## వారంలో ఎన్నికల నోటిఫికేషన్

**గుంటూరు అక్టోబరు 5, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేసాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నగారా మోగించేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ నెల 7న అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్... అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు , పోలీస్ కమిషనర్లతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు.సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన క్షేత్రస్థాయి సంసిద్ధతను కమిషన్ నిశితంగా పరిశీలించనుంది. ఓటర్ల జాబితా ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బ్యాలెట్ బాక్సులు లభ్యత, ఎన్నికల నిర్వహణా సిబ్బంది కేటాయింపు , సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు వంటి అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలకు ఎస్ఈసీ స్పష్టమైన దిశానిర్దేశం చేయనుంది. నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నారు.కలెక్టర్లు, ఎస్పీల భేటీ ముగిసిన వెంటనే... ఈ నెల 8 లేదా 9 తేదీల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎస్ఈసీ అధికారికంగా విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక పోరు కావడంతో అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కూటమి తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తుంటే... ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో పుంజుకోవడానికి ఈ ఎన్నికలను సవాలుగా తీసుకుంటోంది.సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి తీర్పు వచ్చినా దానికి తగ్గట్లుగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు

## వైసీపీకి అభ్యర్థుల కష్టాలు

**నెల్లూరు, అక్టోబరు 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీకి అనేక ఇబ్బందులున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి వ్యయంతో పాటు అధికార పార్టీని ఎదుర్కొనడం అంత సులువుకాదు. మంచి అభ్యర్థులున్నా అధికార పార్టీని తట్టుకోవడం అంత ఈజీ కాదు. ఎందుకంటే.. అన్ని వైపుల నుంచి వత్తిడులు ఉంటాయి. ప్రజలు సహజంగా అధికార పార్టీ కి మద్దతుగా నిలిచేందుకు ఇష్టపడతారు. దీంతో ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అభ్యర్థుల వ్యయం కూడా వైసీపీకి ఇబ్బందిగా మారనుంది. మరొకవైపు పోలీసు కేసులు, ఇతర ఇబ్బందులు పార్టీ కార్యకర్తలను పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం కూడా అంత సులువు కాదు. ఇవన్నీ అధిగమించడంతో పాటు ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఇబ్బందులు కలగొచ్చు. ఆంధ్రప్రదే హైకోర్టు తీర్పు వెలువరించడం మరియు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులు, సవాళ్లు అనేకం ఉన్నాయి. ఎన్నికల వాయిదా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదని వైసీపీ వేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోపు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో వైసీపీ వ్యూహానికి ఎదురుదెబ్బ తగిలింది. గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో ఇంకా పూర్తి స్థాయిలో మనోధైర్యం రాలేదని, క్షేత్రస్థాయిలో నాయకులు, అభ్యర్థుల లభ్యతపై సందిగ్ధత ఉందనే చర్చ జరుగుతోంది.అన్ని స్థానాల్లోనూ కచ్చితంగా పోటీ చేయాలని పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అధికార కూటమి ప్రభుత్వంలో స్థానికంగా ఎదురుదెబ్బలు తగులుతాయనే ఆందోళన కొందరిలో ఉంది. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడే అభ్యర్థులు కూడా కొంత కష్టంగానే కనిపిస్తారుఅభ్యర్థులను బలవంతంగా ఎంపిక చేసినప్పటికీ వారు ఖర్చు పెట్టుకునేందుకు ముందుకు రారు. అధికార పార్టీకి ధీటుగా తాము ఖర్చు చేయలేమని ముందుగానే చేతులెత్తాస్తారు. అది పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జులకు భారంగా మారనుంది. ఆర్థిక భారాన్ని ఇన్ ఛార్జులు భరిస్తారా? లేక పార్టీ నాయకత్వం భరిస్తుందా? అన్న దానిపై స్పష్టత లేదు. దీంతో స్థానిక నియోజకవర్గాల ఇన్ ఛార్జులు మాత్రమే ఈ ఖర్చును భరాయించుకోవాల్సి వస్తే పోటీకి అయితే నిలబెడతారు కానీ, ఖర్చు మాత్రం ఎక్కువగా పెట్టరన్నది అందరికీ సత్యమే. ఖర్చు పెట్టని పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, అందులోనూ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడం అంత సులువు కాదు. అదే ఇప్పుడు వైసీపీకి మైనస్ పాయింట్ గా కనిపిస్తుంది. జగన్ కేంద్ర పార్టీ ఆఫీసులో కూర్చుని ఎన్ని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చివరకు ఖర్చు చేయాల్సి రావడం లోకల్ లీడర్లే కావడంతో అంతగా సుముఖంగా ఉండరు. ఇవన్నీ వైసీపీ విజయాలకు బ్రేకులు వేస్తాయన్న విశ్లేషణలు మాత్రం జోరుగా వినిపిస్తున్నాయి

# ఇండియా, వెస్టిండీస్‌కు బిగ్ షాక్.. రెండు జట్లకు ఐసీసీ భారీ జరిమానా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, వెస్టిండీస్ జట్లకు బిగ్ షాక్ తగిలింది. ఇటీవల ముగిసిన వన్డే సిరీస్?లో భాగంగా న్యూచండీగఢ్ వేదికగా జరిగిన చివరిదైనా మూడో వన్డేలో స్లో ఓవర్ రేటింగ్ కారణంగా ఇరుజట్లకు ఐసీసీ జరిమానా విధించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇండియాకు 20 శాతం, వెస్టిండీస్?కు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించారు. ఈ మ్యాచులో భారత్, వెస్టిండీస్ ఇరుజట్లు నిర్ణీత సమయంలోగా బౌలింగ్ కోటాను పూర్తి చేయలేదని ఆన్-ఫీల్డ్ అంపైర్లు జయరామన్ మదనగోపాల్, సామ్ నోగాజ్స్కి, థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా, ఫోర్త్ అంపైర్ వీరేందర్ శర్మ ఐసీసీకి ఫిర్యాదు చేశారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ ఇద్దరూ తమ తప్పును అంగీకరించారు. దీంతో ఎలాంటి అధికారిక విచారణ లేకుండానే మ్యాచ్ రెఫరీ ప్రకాష్ భట్ జరిమానా విధించారు.

ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా వేసే ప్రతి ఓవర్‌కు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 5 శాతం చొప్పున పెనాల్టీ విధిస్తారు. భారత్ నాలుగు ఓవర్లు, వెస్టిండీస్ రెండు ఓవర్లు ఆలస్యంగా వేసినట్లు తేలింది. దీంతో గిల్ సేనకు 20 శాతం, వెస్టిండీస్? ఆటగాళ్లకు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత పడింది.

**వన్డే సిరీస్ ఇండియా వశం..!**

భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్?ను టీమిండియా 2-1 తేడాతో దక్కించుకుంది. సిరీస్‌లోని తొలి రెండు వన్డేలను గెలిచిన భారత్ మూడవ వన్డేలో ఓటమి పాలైంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన చివరి వన్డేలో పర్యాటక జట్టు విజయం సాధించింది. కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీ సాధించిన ఇండియా ఓటమి పాలైంది.

# 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యంత కీలకం: దినేశ్ కార్తీక్

- కెప్టెన్ గిల్‌కు రోహిత్ అనుభవం, సలహాలు ఎంతో ఉపయోగపడతాయన్న దినేశ్
- ఒత్తిడి సమయాల్లో గిల్.. రోహిత్‌పైనే ఆధారపడతాడని కార్తీక్ జోస్యం
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనున్న 2027 ప్రపంచకప్
- వన్డేల్లో తనకు ఇంకా పని మిగిలి ఉందని రోహిత్ ఇటీవలే చెప్పిన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ సేవలు అత్యంత కీలకం కానున్నాయని టీమిండియా మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ అపారమైన అనుభవం, ప్రస్తుత ఫామ్ జట్టుకు అతిపెద్ద బలమని, ముఖ్యంగా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అతని మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కార్తీక్ పేర్కొన్నాడు.వెస్టిండీస్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌ను దినేశ్ కార్తీక్ ఉదాహరణగా చూపించాడు. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ సాధించిన సెంచరీ అతని ఫామ్‌కు నిదర్శనమని ప్రశంసించాడు. ఆటలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో రోహిత్ అనుభవం గిల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నాడు.ఈ విషయంపై కార్తీక్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా, నాయకుడిగా ఆటలో ఉత్కంఠభరితమైన క్షణాల్లో రోహిత్ ఇచ్చే సలహాలు అమూల్యమైనవి. ముఖ్యంగా ఒక పెద్ద మ్యాచ్‌లో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కచ్చితంగా రోహిత్ వైపే చూస్తాడని, అతనిపైనే ఆధారపడతాడని నేను భావిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. సీనియర్ ఆటగాడిగా, మాజీ కెప్టెన్‌గా జట్టులో రోహిత్ పోషించే పాత్ర కీలకమని పేర్కొన్నాడు.కాగా, వన్డే ఫార్మాట్‌లో తనకు ఇంకా 'పని మిగిలి ఉంది' అని, 2027 ప్రపంచకప్‌లో ఆడాలనే తన కోరికను రోహిత్ శర్మ ఇటీవల బహిరంగంగా వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో ఆడటమే లక్ష్యంగా హిట్ మ్యాన్ ముందుకు సాగుతున్నాడు. వన్డేల్లో నిలకడగా పరుగులు సాధిస్తుండటంతో, రాబోయే ప్రపంచకప్ కోసం భారత జట్టు రూపొందించే ప్రణాళికల్లో రోహిత్ శర్మ కేంద్ర బిందువుగా కొనసాగుతున్నాడు.

# గంగూలీ కెప్టెన్సీలో టీమిండియా లక్ష్యం అదే.. సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు



- గంగూలీ జట్టు లక్ష్యం విదేశాల్లో ఎక్కువ విజయాలేనన్న సెహ్వాగ్
- అప్పటి జట్టు ఆ లక్ష్యాన్ని సాధించిందని వ్యాఖ్య
- ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాట్లాడలేనన్న సెహ్వాగ్
- మ్యాచ్ పరిస్థితికి తగ్గట్టే తన ఆట మార్చేవాడినని వివరణ
- అవసరమైతే రక్షణాత్మకంగా ఆడానని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** సౌరవ్ గంగూలీ నాయకత్వంలో టీమిండియా ఎలా ఆడేదో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. విదేశీ గడ్డపై వీలైనన్ని మ్యాచ్‌లు గెలవాలన్నదే అప్పటి జట్టు ప్రధాన లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాత్రం తాను మాట్లాడలేనని స్పష్టం చేశాడు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సెహ్వాగ్ ఐఏఎన్ఎస్‌తో మాట్లాడాడు. ఈ సందర్భంగా అప్పటి జట్టు ఆలోచనా విధానాన్ని వివరించాడు. "నేను దాదా నాయకత్వంలోని జట్టులో ఉన్నాను. కాబట్టి ఆ జట్టు ఆలోచనా విధానం గురించి చెప్పగలను. ప్రస్తుత జట్టులో నేను లేను. వారి ఆటతీరు గురించి నాకు పూర్తిగా తెలియదు. అందుకే దానిపై మాట్లాడలేను" అని సెహ్వాగ్ అన్నాడు.గంగూలీ నాయకత్వంలో తమ ప్రధాన లక్ష్యం అంతర్జాతీయ మ్యాచ్ లలో ఎక్కువగా గెలవడమేనని చెప్పాడు. విదేశీ గడ్డపై విజయాలు

సాధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపాడు. ఆ లక్ష్యాన్ని జట్టు సాధించిందని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు.తాను ఎప్పుడూ దూకుడుగా ఆడేవాడిని కాదని కూడా సెహ్వాగ్ గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించాడు. మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరును మార్చుకునేవాడినని తెలిపాడు. అవసరమైనప్పుడు రక్షణాత్మకంగా కూడా ఆడానని చెప్పాడు.సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఓపెనింగ్ జోడీల్లో ఒకటిగా నిలిచింది. ఇద్దరూ కలిసి టీమిండియా ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించారు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్‌కు సెహ్వాగ్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు. గత సీజన్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన అశ్నీర్ గ్రోవర్ స్థానంలో అతడు వచ్చాడు. ఈ రియాలిటీ షోలో 15 మంది కంటెస్టెంట్లు 42 రోజుల పాటు పోటీపడతారు. అధికారాన్ని దక్కించుకోవడం, వ్యూహాలు, పొత్తులు ఈ ఆటలో కీలకంగా ఉంటాయి. ఈ షో అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో ప్రసారం అవుతోంది.

# వారణాసి.. ఎంత చెప్పాలో అంతే..



కలలు కనే డీప్-రెడ్ వెల్వెట్ లుక్‌లో యుక్తి తరేజా స్టన్స్

రాజమౌళి సినిమా అంటే షూటింగ్ మొదలైనప్పటి నుంచి రిలీజ్ వరకు ఒక ఐరన్ కాంపౌండ్ లాంటి సెక్యూరిటీ ఉంటుంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ టైమ్ లో ఎవరెంత మాట్లాడాలో ఆయన కంట్రోల్ లోనే ఉండేది. కానీ మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' ప్రాజెక్ట్ విషయంలో మాత్రం సీన్ పూర్తిగా రివర్స్ అయింది. సినిమా గురించి టీమ్ నుంచి చిన్న చిన్న అప్డేట్స్ రెగ్యులర్ గా బయటకు రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.



ఈ సినిమా బ్యాక్ డ్రాప్ పై అసలు హింట్ మొదట రైటర్ విజయేంద్ర ప్రసాద్ నుంచే వచ్చింది.

ఇది ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే అడ్వెంచర్ అని ఆయన చెప్పగా.. ఆ తర్వాత స్వయంగా రాజమౌళే గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ అంటూ ఒక క్లారిటీ ఇచ్చేశాడు. దీనికి తోడు మహేష్ బాబు కూడా ఆఫ్రికా షెడ్యూల్స్, అడవుల్లో షూటింగ్ ఎక్స్ పీరియన్స్ గురించి ఓపెన్ గా మాట్లాడటంతో సినిమా థీమ్ ఏంటనేది జనాలకు ఈజీగా అర్థమైపోయింది.

మరోవైపు ఎప్పుడూ తన పనేదో తాను సైలెంట్ గా చేసుకుపోయే సంగీత దర్శకుడు కీరవాణి కూడా ఈసారి తన పంథా మార్చారు. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉంటాయని, మ్యూజిక్ వర్క్ ఎంతవరకు వచ్చిందో కచ్చితమైన వివరాలు బయటపెట్టారు. గతంలో జక్కన్న సినిమాల్లో సాంగ్స్ కౌంట్ రిలీజ్ టైమ్ వరకు సస్పెన్స్ గానే ఉండేది. కానీ ఏకంగా 2027 సమ్మర్ రిలీజ్ టార్గెట్ అంటూ కీరవాణి ముందే ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక యాక్షన్ ఎపిసోడ్స్ మీద రీసెంట్ గా ఎస్ఎస్ కార్తికేయ ఇచ్చిన హైప్ అంతా ఇంతా కాదు. ఆర్ఆర్ఆర్, బాహుబలిని మించేలా సీట్ ఎడ్జ్ యాక్షన్ ఉంటుందని ఆయన చెప్పగా.. తన క్యారెక్టర్ లో కూడా హెవీ స్టంట్స్ ఉంటాయని హీరోయిన్ ప్రియాంక చోప్రా ముందే ఒక క్లూ ఇచ్చింది. ఇలా టీమ్ లోని ఒక్కొక్కరు ఒక్కో పాయింట్ ను రివీల్ చేస్తుండటంతో, ప్రేక్షకుడి మైండ్ లో 'వారణాసి' కాన్వాస్ పై ఒక స్ట్రాంగ్ ఇమేజ్ క్రియేట్ అయిపోయింది.అయితే బయటపడుతున్న ఈ విషయాలన్నీ కథను డ్యామేజ్ చేసే లీకులు ఏమాత్రం కాదు. ఎవరెన్ని చెప్పినా మహేష్ మెయిన్ క్యారెక్టరైజేషన్, అసలు కాన్ఫ్లిక్ట్, స్టోరీలో వచ్చే మేజర్ ట్విస్టులు మాత్రం ఇంకా రాజమౌళి లాకర్ లోనే సేఫ్ గా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే జక్కన్న ఈసారి కండిషన్స్ కు కాస్త బ్రేక్ ఇచ్చి, సినిమా బజ్ ను ఎప్పుడూ పీక్స్ లో ఉంచేలా పక్కా క్యాలిక్యులేటెడ్ గానే ఈ ఇన్ఫర్మేషన్ ను వదులుతున్నట్లు అనిపిస్తోంది.గతంలో రాజమౌళి సినిమాల చిన్న అప్డేట్ కోసం ఫ్యాన్స్ నెలల తరబడి వెయిట్ చేసేవాళ్లు. కానీ ఇప్పుడు గ్లోబల్ మార్కెట్ ను టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో, సినిమా గురించి కంటిన్యూస్ గా బజ్ ఉండడం అవసరం. అందుకే రాజమౌళి లిమిట్స్ సడలించి, ప్రమోషన్ కు ఉపయోగపడే కంటెంట్ ను టీమ్ ద్వారానే బయటకు రప్పిస్తున్నారు. దీంతో వారణాసి పేరు ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉండేలా మాస్టర్ ప్లాన్ వేశారని అర్థమవుతోంది.



హెబ్బా పటేల్ యొక్క రొమాంటిక్ రెడ్ గౌన్ లుక్ స్వచ్ఛమైన సొగసుగా ఉంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com